క్లుప్తంగా

ఆత్మీయ వీడ్కోలు



మహబూబాబాద్ రూరల్: పదవీ విరమణ పొందుతున్న హోంగార్డ్ ఆఫీసర్ జె.వెంకన్నకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆత్మీయవీడ్కోలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, సీఐ రాజేష్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సీసీ చంద్రకాంత్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మహబూబాబాద్ రూరల్: డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన బీఎస్పీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జ్ విజయకాంత్, ఉపేందర్, శ్రీను పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా వెంకటరామారావు



మహబూబాబాద్ రూరల్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా మరిపెడ పట్టణానికి చెందిన తల్లాడ వెంకటరామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిరుప అనిల్, ఎన్నికల కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీదర వీరన్న, ప్రతాపని పాండురంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిశోర్ కుమార్, ఎన్నికల పరిశీలకుడు ఊరె లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎంకు వినతి



డోర్నకల్: అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేసి మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నలబోలు సునీత తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సునీత హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి బాధితులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధికి సహకరించాలి



మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులోని సిగ్నల్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం చైర్మన్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్ పాల్గొన్నారు.

జ్వరాల నివారణపై దృష్టి సారించాలి

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు గ్రామాల్లో విస్తరిస్తున్న జ్వరాల నివారణపై వైద్యాధికారులు దృష్టి సారించాలని సీపీఎం మండల కార్యదర్శి యు.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో నాయకులు శెట్టి వెంకన్న, బొబ్బ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి బంగారు పతకం



మహబూబాబాద్ అర్బన్: ఒలింపియాడ్ మాథ్స్ సైన్స్ టెస్టుల్లో జాతీయస్థాయిలో దేశబోయిన యజ్ఞేష్ కృష్ణ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏకశిలా ఏంజెల్ స్కూల్లో ఇండియన్ టాలెంట్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న రోడ్డుపై గుంతలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ప్రమాదాలకు కారణమవుతున్న గుంత

దంతాలపల్లి: దంతాలపల్లి మండలంలో జాతీయ రహదారిపై నిత్యం వివిధ వాహనాలతో రద్దీగా ఉంటుంది. కానీ ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు మాత్రం ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతల్లో ప్రతీ రోజు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత నెలలో గుంతను తప్పించే క్రమంలో ఓ ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడి, మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఉన్నత అధికారులు గుంతను పరిశీలించినా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం రాలేదు. శుక్రవారం మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామంలో తమ బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనంను తప్పించబోయి వారి ద్విచక్రవాహనం గుంతలో పడిపోయింది. దీంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. చుట్టు పక్కల రైతులు క్షతగాత్రులను తొర్రూరు ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా రోడ్డుపై గుంతలు పూడ్చి భరోసా కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారిపై చర్య తీసుకోవాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న భీమానాయక్

నెహ్రూసెంటర్: ఉద్యోగ పదోన్నతులు, డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన గిరిజన అభివృద్ధి శాఖ ఏసీఎంఓ వీరులాల్‌పై చర్య తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ కోరారు. ప్రజాసంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ప్రమోషన్ల విషయంలో అర్హత లేని టీచర్లకు అక్రమదారిలో ప్రమోషన్లు వచ్చేలా వీరులాల్ చేశాడని ఆరోపించారు. ఆదివాసీ మహిళ టీచర్‌కు ప్రమోషన్ విషయంలో అన్యాయం చేస్తూ అనర్హుడికి కట్టబెట్టారన్నారు. ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విష్ణునాయక్, కందిపాటి వెంకటేష్, మంగిలాల్‌నాయక్, కొప్పుల కిరణ్, స్వామినాయక్, రాంచంద్రునాయక్, భూక్య హేమ్లానాయక్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: గిరిజన అభివృద్ధి శాఖ ఏసీఎంఓ వీరులాల్‌పై మహబూబాబాద్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎస్సై భీమారెడ్డికి లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

తండ్రిపై దాడిచేసిన కొడుకు అరెస్టు

కురవి: తండ్రిపై గొడ్డలితో దాడి చేసిన సంఘటనలో కొడుకును శుక్రవారం అరెస్టు చేసినట్లు సీరోలు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సీరోలు మండలం చింతపల్లి శివారు కొత్త తండాకు చెందిన బాణోత్ స్వామి అనే వ్యక్తికి అతని తండ్రి భీమాకు జరిగిన భూమి తగాదా విషయంలో ఈనెల 27న స్వామి తండ్రిని గొడ్డలితో నరికి గాయపరిచాడు. శుక్రవారం స్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన వివాహిత మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన దివ్య సాయంత్రం వరకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్న దివ్య భర్త ప్రసాద్‌కు సమాచారం అందించారు. ప్రసాద్ తొడేళ్లగూడెంకు చేరుకుని బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నగదు, ఆభరణాల అపహరణ



డోర్నకల్: చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ



చిన్నగూడూరు(నర్సింహులపేట): డబ్బాను పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

చిన్నగూడూరు (నర్సింహులపేట) : తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి దొంగలు నగదు అపహరించుకెళ్లిన ఘటన నర్సింహులపేట మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్ని తండాకు చెందిన గుగులోత్ రాందాస్ రూ.2.69 లక్షల నగదును ఇంట్లోని రెండు టిఫిన్ డబ్బాలలో పెట్టి తాళం వేసి గురువారం పని నిమిత్తం బయటికి వెళ్లాడు. అనంతరం ఇంటికి వచ్చి చూసే సరికి టిఫిన్ డబ్బాలను పగులగొట్టి అందులోని నగదు చోరీ జరిగిందని గుర్తించాడు. తను బయటకు వెళ్లేటప్పుడు పొరుగున నివాసముండే ఇద్దరు వ్యక్తులు తన ఇంటి వద్ద ఉన్నారని తెలిపాడు. వారిపై అనుమానంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్పందించిన ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఫిర్యాదులో తెలిపిన ఇద్దరు అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. బాధితుడు రాందాస్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి క్లూస్ టీంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపాడు.

రెండిళ్లలో నగదు, ఆభరణాల చోరీ

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధిలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌వీధికి చెందిన మేకల రామారావుతోపాటు అతడి ఇంటి సమీపంలోని శీలం జానకిరాములు ఇళ్లకు తాళాలు వేసి ఊరికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు ఇళ్ల తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. రామారావు ఇంట్లో రూ.80వేల విలువ కలిగిన బంగారు నగలు, రూ.20వేల నగదు, శీలం జానకిరాములు ఇంట్లో రూ.25వేల విలువైన బంగారు వస్తువులు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించినట్లు సీఐ తెలిపారు.

వాహనం బోల్తా



గార్ల: గార్ల నుంచి నామాలపాడు వెళ్తున్న మాజీ ఎంపీపీ ఎం శివాజీచౌహాన్ స్కార్పియో వాహనం సేరిపురం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి పొలంలో బోల్తాపడింది. ఈఘటనలో మాజీ ఎంపీపీకి స్వల్పగాయలు కాగా వాహనంలో ఉన్న మిగతా ముగ్గురు క్షేమంగా ఉన్నారు.

రుణమాఫీ అమలు చేయాలని వినతి



గంగారం: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గంగారం: రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంపూర్ణ రుణమాఫీని అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ 40శాతం మంది అర్హులైన రైతులకు వర్తించలేదన్నారు. వెంటనే రూ.2లక్షల రుణమాఫీని అమలుచేసి, నూతన పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈక భిక్షం, కురుసం రంగన్న, వీరస్వామి, బాలు,సురేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

పెద్దవంగర: రూ. 2లక్షలు రుణమాఫీ కాని రైతులు ఆవేదన చెందుతుంటే, రుణమాఫీ అయిన రైతులకు బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు బైన భిక్షపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రుణమాఫీ జరిగిన రైతులందరికీ ఆలస్యం చేయకుండా రెన్యూవల్ చేయాలని కోరాడు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



కురవి: పూజల్లో పాల్గొన్న భక్తులు

కురవి: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రతం పూజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. మహిళలు పూజలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి పాల్గొని పూజలు చేశారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సర్వయ్య

కేసముద్రం: గణేశ్ నవరాత్రుల ఉత్సవాలను, నిర్వాహకులు శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో గణేశ్ మండప నిర్వాహకులతో, మతపెద్దలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మురళీధర్‌రాజు, మండప నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో దోమల వ్యాప్తి



నిల్వ నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

తొర్రూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది నిల్వ నీటిని పారబోశారు. చెత్తా చెదారం తొలగించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వ్యాపిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, సిబ్బంది రాజు, పట్టాభి, దేవేందర్ పాల్గొన్నారు.

లేఅవుట్ నిబంధనలు పాటించాలి

ప్రతీ ఒక్కరు లేఅవుట్ నిబంధనలు పాటించాలని కమిషనర్ శాంతికుమార్ అన్నారు. దానికి విరుద్ధంగా నిర్మాణాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ నుంచి 100 మీటర్లు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



గార్ల: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గార్ల: ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన ప్రకారం సీపీఎస్ పెన్షన్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గార్లలో ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి ఉపాధ్యాయ సంఘం నాయకుడు బాదావత్ శ్రీను మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శివనాయక్, ఈరునాయక్, ప్రసాదరావు, భోజ్యానాయక్, హీరాలాల్, భాస్కర్, నాగేశ్వరరావు, రాము, రమేశ్, నరేష్, వీర్యా, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే పరిష్కారం

కురవి: పాత పెన్షన్ పునరుద్ధరణే ఏకైక పరిష్కారమని, యూనిఫైడ్ పెన్షన్ స్కీం మరో భ్రమ మాత్రమేనని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలిచర్ల, రాజోలు, నల్లెల్ల, మోద్గులగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, బాబు, సురేష్, రాజు, సలీం, వీరన్న పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాశాల బృందం

మహబూబాబాద్ అర్బన్: పర్యావరణ రహిత మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. క్లైమేట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, సాంబశివరావు, రాజశేఖరం, వినోద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సరుకులను ఉచితంగా అందించాలి

కేసముద్రం: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదప్రజలకు 9రకాల సరుకులను ప్రభుత్వం ఉచితంగా అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ డిమాండ్ చేశాడు. శుక్రవారం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గుత్తామేస్త్రీలు, కూలీల సదస్సు నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసన చట్టం చేయాలన్నారు.

బ్యాగుల పంపిణీ

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ, కుమ్మరికుంట్ల, రేపోణి, పంతులుతండా, వాల్యాతండా ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు హోప్స్ చారిటబుల్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీదేవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రోగులకు పండ్లు..

నెహ్రూసెంటర్: భారత్ వికాస్ పరిత్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పాలియేటివ్ కేర్, కేన్సర్, పక్షవాతంతో బాధపడుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీవీపీ సభ్యులు జయప్రకాశ్‌లోయ, విశ్వనాథం, గోపాల్, పున్నంచంద్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలను తగ్గించాలి

కేసముద్రం: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ధరలను తగ్గించాలంటూ సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలి

డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును అధికారులు నిత్యం పర్యవేక్షించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలు అందడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలను నిత్యం తనిఖీ చేస్తూ పనితీరును మెరుగుపర్చాలని డిమాండ్ చేశాడు.


సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన మూడు, నాలుగు సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో నలంద డిగ్రీ కళాశాల ప్రభంజనం సృష్టించిందని కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ అన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మరిపెడ రూరల్: సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమని తానంచర్ల మాజీ ఎంపీటీసీ గుగులోతు రమేష్ నాయక్ అన్నారు. మండలంలోని డీఆర్ఎస్ జెండాల్‌తండాకు చెందిన గుగులోతు కిరణ్‌నాయక్‌కు రూ.60వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

పిచ్చమ్మ ఆశయాల సాధనకు పాటుపడాలి



తొర్రూరు రూరల్: కమ్యూనిస్ట్ పార్టీ నాయకురాలు పెరుమాండ్ల పిచ్చమ్మ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని గుర్తూరు గ్రామంలో మృతి చెందగా, మృతదేహానికి పూలమాలలు వేసి, ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు రాజన్న, రాజు, సోమయ్య, అశోక్, యాకుబ్, సాయిమల్లు పాల్గొన్నారు.

యూటీఎస్ యాప్‌పై అవగాహన

మహబూబాబాద్ రూరల్: అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టం (యూటీఎస్) యాప్ ద్వారా రైల్వే ప్రయాణికులకు సత్వర సేవలు అందుబాటులో ఉన్నాయని రైల్వే బుకింగ్ క్లర్క్ లలిత అన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ రెండో నంబరు ప్లాట్ ఫారంపై గల పశ్చిమ బుకింగ్ కౌంటర్ వద్ద శుక్రవారం యాప్ వినియోగంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

పెద్దవంగర: అర్హులైన రైతులకు తప్పని సరిగా రుణమాఫీ అవుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి స్వామి నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రుణమాఫీ కాని రైతుల ఇంటికి వెళ్లి నిర్ధారణ కోసం కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. వారితో కలిసి సెల్ఫీ దిగారు.

రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు



కురవి: కురవి, సీరోలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈమేరకు ఖమ్మం జాతీయ రహదారిపై సీరోలు మండలం తాళ్లసంకీస శివారు బీల్యా తండా వద్ద పెద్ద చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడిపోయింది. దీంతో ఖమ్మం నుంచి మహబూబాబాద్‌కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై పడిపోయిన చెట్టు కొమ్మను స్థానికులు తొలగించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి



నెహ్రూసెంటర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. సీపీఐ ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 23, 26 వార్డుల్లో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, డ్రెయినేజీలను శుభ్రం చేయడం, చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్రీనివాస్, సింగు శ్రీనివాస్, ఉప్పలయ్య, పుచ్చకాయల చిరంజీవి, మైన సాయి, పద్మ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.